సాక్షి
విశాఖపట్నం
బుధవారం । 1 । మార్చి । 2023



పరిశోధనలపై ఆసక్తి చూపాలి
విద్యార్థులు పరిశోధనలపై ఆసక్తి చూపాలని జిల్లా విద్యాశాఖాధికారి చంద్రకళ సూచించారు. 8లో



స్టీల్‌ప్లాంట్‌ను కాపాడేది మేమే
స్టీల్‌ప్లాంట్‌ను కాపాడేది వైఎస్సార్ సీపీ మాత్రమేనని ఆ పార్టీ రీజినల్ కో ఆర్డినేటర్ వై.వి.సుబ్బారెడ్డి అన్నారు. 10లో



ప్రాణం తీసిన అతివేగం
పెద్దిపాలెం హైవేపై జరిగిన రోడ్డు ప్రమాదంలో విద్యార్థి దుర్మరణం పాలయ్యాడు. మరో విద్యార్థి తీవ్రంగా గాయపడ్డాడు. 8లో

న్యూస్‌రీల్

పనుల పురోగతిపై మేయర్ ఆరా



తీరంలోని పనుల పురోగతిని పరిశీలిస్తున్న మేయర్ హరివెంకటకుమారి

బీచ్‌రోడ్డు: జీ– 20 సదస్సు నేపథ్యంలో ఆర్.కె.బీచ్ నుంచి వైఎంసీఏ వరకు చేపడుతున్న ఇంజినీరింగ్, పారిశుద్ధ్య పనులను మంగళవారం మేయర్ గొలగాని హరివెంకటకుమారి పరిశీలించారు. పనుల పురోగతిని అధికారులను అడిగి తెలుసుకున్నారు. దేశ విదేశాల నుంచి ఎంతో మంది అతిథులు నగరానికి విచ్చేస్తున్న సందర్భంగా.. వారికి ఎటువంటి లోటుపాట్లు లేకుండా చూడాల్సిన బాధ్యత మనదేనన్నారు. కాలువల్లోని వ్యర్థాల తొలగింపు ప్రక్రియ దగ్గరుండి పరిశీలించారు. దీపాలంకరణ, రోడ్లు, ఫుట్‌పాత్‌ల మరమ్మతులు, ప్రజా మరుగుదొడ్లు, తాగునీరు, నగర సుందరీకరణ తదితర పనులపై ఆరా తీశారు. ఆమె వెంట డిప్యూటీ మేయర్లు, జియ్యాని శ్రీధర్, కె.సతీష్, జీవీఎంసీ వైఎస్సార్ సీపీ ఫ్లోర్‌లీడర్ బానాల శ్రీనివాసరావు ఉన్నారు.

ఎన్‌ఐవో సైంటిస్ట్ ఇన్‌చార్జిగా శర్మ



సాక్షి, విశాఖపట్నం: నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఓషనోగ్రఫీ (ఎన్‌ఐవో) రీజనల్ సెంటర్ సైంటిస్ట్ ఇన్‌చార్జిగా డాక్టర్ వీవీఎస్ఎస్ శర్మ నియమితులయ్యారు. ప్రస్తుతం చీఫ్ సైంటిస్ట్‌గా ఉన్నారు. ఇప్పటి వరకు సైంటిస్ట్ ఇన్‌చార్జిగా ఉన్న జీపీఎస్ మూర్తి మంగళవారం పదవీ విరమణ చేశారు. ఆయన స్థానంలో శర్మను నియమించారు. విశాఖ కేంద్రంగా ఉన్న రీజనల్ సెంటర్‌లో శర్మ 2007 నుంచి వివిధ హోదాల్లో పనిచేస్తున్నారు. ఎన్‌ఐవోలో చేరకముందు ఆయన ఫ్రాన్స్‌లో మూడేళ్లు, జపాన్‌లో ఎనిమిదేళ్లు పనిచేశారు. విశాఖ రీజనల్ సెంటర్‌లో బయోకెమికల్ లేబొరేటరీ ఏర్పాటులో కీలకపాత్ర పోషించారు. బెంగళూరు ఇండియన్ అకాడమీ ఆఫ్ సైన్స్‌లో ఫెలోగా ఉన్నారు. ఓషన్ సైన్సెస్ అండ్ టెక్నాలజీస్‌లో జాతీయ అవార్డు, హిడాక ఔట్‌స్టాండింగ్ పబ్లికేషన్ అవార్డు, ఇండియన్ సైన్స్ కాంగ్రెస్, అమెరికన్ జియో ఫిజికల్ యూనియన్‌ల నుంచి యంగ్ సైంటిస్ట్ అవార్డులను అందుకున్నారు. జీ–20 దేశాల ఓషన్స్ థీమ్ ఆఫ్ ది క్లైమేట్ సస్టయినబిలిటీ వర్కింగ్ గ్రూపు అడ్వైజరీ కమిటీ సభ్యునిగా వ్యవహరిస్తున్నారు. ఈయన రాసిన 200కి పైగా ఆర్టికల్స్ ప్రఖ్యాత అంతర్జాతీయ జర్నల్స్‌లో ప్రచురితమయ్యాయి.

మాదక ద్రవ్యాల అక్రమ రవాణా నిరోధించాలి



మాట్లాడుతున్న కలెక్టర్ డాక్టర్ మల్లికార్జున

మహారాణిపేట(విశాఖ దక్షిణ): మాదక ద్రవ్యాల అక్రమ రవాణా నిరోధించేందుకు అన్ని చర్యలు చేపట్టాలని కలెక్టర్ డాక్టర్ ఎ. మల్లికార్జున అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లోని చాంబర్‌లో మంగళవారం నిర్వహించిన నార్కోటిక్స్ కో–ఆర్డినేషన్ కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. యువత మత్తు పదార్థాల వైపు ఆకర్షితులు కాకుండా అన్ని చర్యలు చేపట్టాలని స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో అధికారులను ఆదేశించారు. మత్తు పదార్థాలకు సంబంధించిన ఏ సమాచారమైనా 14500 నంబర్‌కు తెలియజేయాలన్నారు. గంజాయి రవాణాను పూర్తిస్థాయిలో అరికట్టాలన్నారు. కాలేజీ, స్కూళ్లలో కమిటీలు ఏర్పాటు చేసి తరచూ సమావేశాలు నిర్వహించాలని సూచించారు. ఎస్ఈబీ ఏఎస్పీ బి.శ్రీనివాసరావు మాట్లాడుతూ మార్పు కౌన్సెలింగ్ సెంటర్ ద్వారా 528 మంది విద్యార్థులకు కౌన్సెలింగ్ చేసినట్లు తెలిపారు. 105 కాలేజీలు, స్కూళ్లలో డ్రగ్ ప్రివెన్షన్ కమిటీలు ఏర్పాటు చేసినట్లు వివరించారు. సమావేశంలో పోలీస్, పోర్ట్, కోస్ట్ గార్డ్, మెడికల్, విద్య తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.

వైఎంసీఏ జాతీయ కౌన్సిల్ ఉపాధ్యక్షురాలిగా విలియమ్స్



దొండపర్తి: వైఎంసీఏ జాతీయ కౌన్సిల్ ఉపాధ్యక్షురాలిగా విశాఖ వైఎంసీఏకు చెందిన డాక్టర్ బెట్సీ మెరిలిన్ విలియమ్స్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. నేషనల్ కౌన్సిల్ ఆఫ్ వైఎంసీఏస్ ఆఫ్ ఇండియా 35వ త్రైవార్షిక సమావేశంలో భాగంగా ఎన్నికలు నిర్వహించారు. విశాఖకు చెందిన విజయ్‌ప్రధాన్ జాతీయ కార్యవర్గ సభ్యుడిగాను, డి.కృపదన్‌కుమార్ విశాఖ వైఎంసీఏ అధ్యక్షుడిగా ఎన్నికయ్యారు.

సర్వం సన్నద్ధం



గ్లోబల్ ఇన్వెస్టర్స్ సమ్మిట్‌కు ఏయూ ఇంజనీరింగ్ కళాశాలలో ఏర్పాట్లు



ఏర్పాట్లు పరిశీలిస్తున్న మంత్రి అమర్‌నాథ్

- పెట్టుబడుల సదస్సుకు విశాఖ ముస్తాబు
- ఇన్వెస్టర్లకు స్వాగతం పలుకుతున్న సిటీ
- వేదికల వద్ద అదిరిపోయేలా అడ్వాంటేజ్ ఏపీ ఆకృతులు

సాక్షి, విశాఖపట్నం: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న గ్లోబల్ ఇన్వెస్టర్స్ సమ్మిట్–2023కు విశాఖ నగరం సర్వాంగ సుందరంగా సిద్ధమైంది. 24 దేశాలకు చెందిన 8 వేలకు పైగా అతిథులు హాజరవుతున్న సదస్సు కోసం ఏయూ ఇంజినీరింగ్ మైదానంలో పూర్తిస్థాయి ఏర్పాట్లు చేస్తున్నారు. ఇప్పటికే రాష్ట్రస్థాయి ఉన్నతాధికారులు నగరానికి చేరుకొని ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నారు. బుధవారం సాయంత్రం నుంచి ప్రముఖుల రాకతో నగరం కళకళలాడనుంది. సదస్సు ఏర్పాట్లను మంత్రి గుడివాడ అమర్‌నాథ్ అధికారులతో కలిసి మంగళవారం పరిశీలించారు.

130 స్టాళ్లు సిద్ధం

జీఐఎస్ కోసం ఏయూ మైదానంలో ఏర్పాటు చేస్తున్న 5 జర్మన్ హ్యాంగర్స్ హాల్స్ పనులు దాదాపు పూర్తయ్యాయి. 14 రంగాల్లో ఇన్వెస్టర్లను ఆకట్టుకొని.. రాష్ట్రంలో ఉన్న వనరులు, ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహకాల గురించి వివరించేలా మొత్తం 130 స్టాళ్లు సిద్ధమవుతున్నాయి. సదస్సుకు వచ్చే ప్రతి ఒక్కరికీ స్వాగతం పలికేలా అడ్వాంటేజ్ ఏపీ పేరుతో ప్రత్యేక ఆకృతులు ఏర్పాటు చేస్తున్నారు. దీనికి సంబంధించిన డిజైన్లను ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి కొద్ది రోజుల క్రితం ఆమోదించడంతో వాటి ఏర్పాటు పనులు చురుగ్గా సాగుతున్నాయి. అతిథుల కోసం ఇప్పటివరకు నగరంలోని పలు హోటల్స్‌లో దాదాపు 1100 గదుల్ని అధికారులు బ్లాక్ చేశారు. వీటితో పాటు నగరానికి వస్తున్న పలు సంస్థల ప్రతినిధులు కూడా నగరంలోని స్టార్ హోటల్స్, రిసార్టులు మొదలుకొని సాధారణ ఏసీ హోటళ్లలో గదులు కూడా బుక్ చేసుకోవడంతో ఈనెల 5వ తేదీ వరకు అన్ని నిండిపోయాయి.

ఎగ్జిబిషన్ ప్రారంభించనున్న సీఎం జగన్

ఈనెల 3వ తేదీన ఉదయం గ్లోబల్ ఇన్వెస్టర్స్ సమ్మిట్–2023 ప్రారంభోత్సవంలో దేశ వ్యాప్తంగా వస్తున్న పారిశ్రామికవేత్తలు, విదేశాల నుంచి వస్తున్న ప్రతినిధులతో పెద్ద ఎత్తున ప్రారంభోత్సవ కార్యక్రమం నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా ఎగ్జిబిషన్ ఏర్పాటు చేశారు. ప్రధానమైన రంగాలతో పాటు రాష్ట్రంలో పారిశ్రామికవేత్తలు నడుపుతున్న భారీ పరిశ్రమలను ప్రదర్శించే ఎగ్జిబిషన్‌ను ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రారంభించనున్నారు. దేశంలో ఉన్న ప్రముఖ పారిశ్రామికవేత్తలతో పాటు 20 నుంచి 25 దేశాలకు సంబంధించిన వివిధ దేశాల ప్రతినిధులు, 12 నుంచి 14 దేశాల అంబాసిడర్స్, వివిధ దేశాలకు సంబంధించి మరో 8 మంది ముఖ్యులు హాజరుకానున్నారు. ఇప్పటికే యూరోపియన్ యూనియన్ నుంచి చాంబర్ ఆఫ్ కామర్స్ ప్రతినిధులు నగరానికి చేరుకున్నారు. విశాఖపట్నం సహా రాష్ట్రంలో ఉన్న అన్ని జిల్లాల వనరులు, స్థానికంగా ఉన్న పరిశ్రమల స్థాపనకు ఉన్న అవకాశాలను, అనుకూల వాతావరణాన్ని స్టాళ్ల రూపంలో పెద్ద ఎత్తున ప్రదర్శించనున్నారు.

సమ్మిట్‌కు భారీ భద్రత



సూచనలిస్తున్న నగర పోలీస్ కమిషనర్ శ్రీకాంత్

- 2,500 మంది పోలీసులతో బందోబస్తు
- బీచ్ సందర్శకులు, ప్రజలు సహకరించాలి
- నగర పోలీస్ కమిషనర్ శ్రీకాంత్

అల్లిపురం: విశాఖలో ఈ నెల 3, 4 తేదీల్లో ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న గ్లోబర్ ఇన్వెస్టర్స్ సమ్మిట్‌కు వచ్చే అతిథులకు 2,500 మంది పోలీసులతో భద్రత కల్పిస్తున్నట్లు నగర పోలీస్ కమిషనర్ సీహెచ్ శ్రీకాంత్ వెల్లడించారు. ఆంధ్రా యూనివర్సిటీలోని సమ్మిట్ జరిగే ప్రాంతంలో మంగళవారం ఆయన పర్యటించి భద్రత ఏర్పాట్లను సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమ్మిట్‌కు వచ్చేందుకు సుమారు 10 వేల మంది ప్రతినిధులు రిజిస్టర్ చేసుకున్నారని.. వీరితో పాటు 50 నుంచి 60 మంది వివిధ దేశాల ప్రతినిధులు వస్తున్నట్లు తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ప్రతినిధులు, కార్యదర్శులు, ఉన్నతాధికారులు ఈ సదస్సులో పాల్గొనే అవకాశం ఉందన్నారు. అతిథులందరికీ ఎంజీఎం పార్కులో ముఖ్యమంత్రి విందు ఏర్పాట్లు చేస్తున్నారన్నారు. వీరందరి భద్రతకు 2,500 మంది పోలీసులతో పాటు గ్రేహౌండ్స్, ఆక్టోపస్, క్యూఆర్‌టీ టీమ్స్‌తో భద్రత ఏర్పాటు చేస్తున్నట్లు వివరించారు.

800 మందితో ట్రాఫిక్ క్రమబద్ధీకరణ

అతిథులు ఎయిర్‌పోర్టు నుంచి వేదిక వద్దకు వచ్చి.. తిరిగి వెళ్లేంత వరకు 800 మంది ట్రాఫిక్ పోలీసులు రహదారి భద్రత, ట్రాఫిక్ నియంత్రణను పర్యవేక్షించనున్నట్లు సీపీ తెలిపారు. నగర పోలీసుల సూచనల మేరకు ప్రజలు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలన్నారు.

ప్రముఖుల భద్రతకు మల్టీలేయర్ సెక్యూరిటీ

సమ్మిట్‌కు వచ్చే ప్రముఖుల భద్రతకు సమ్మిట్ జరిగే ప్రాంతంతో పాటు ఎంజీఎం పార్కు, అతిథులు విడిది చేసే 11 హోటళ్ల వద్ద యాంటీ సాబోటేజ్ టీమ్స్‌తో తరచూ తనిఖీ చేస్తూ.. మల్టీలేయర్ సెక్యూరిటీ ఏర్పాటు చేసినట్లు కమిషనర్ తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వ ఆహ్వానం మేరకు సమ్మిట్‌కు విచ్చేస్తున్న సౌదీ అరేబియా, యూఎస్ఏ తదితర దేశాల ప్రతినిధులకు ప్రత్యేక భద్రత ఏర్పాటు చేసినట్లు చెప్పారు. సమ్మిట్ జరిగే ప్రాంతాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేశామన్నారు. వాటిని జీవీఎంసీ, నగర పోలీస్ కమిషనరేట్ కంట్రోల్ యూనిట్ల నుంచి పర్యవేక్షిస్తామన్నారు. అతిథుల రాక కోసం ఏయూ మైదానంలో మూడు హెలీప్యాడ్లు ఏర్పాటు చేశామన్నారు. సమ్మిట్ జరిగే శని, ఆదివారాల్లో నగర ప్రజలు, బీచ్ సందర్శకులు పోలీసులకు సహకరించాలని కోరారు. బీచ్‌కు వచ్చే వారు తమ వాహనాలను ఏపీఐఐసీ గ్రౌండ్‌లో పార్కు చేసుకోవాలన్నారు.

సమష్టిగా విజయవంతం చేద్దాం..



మాట్లాడుతున్న ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కరికాల వలవన్, చిత్రంలో పరిశ్రమల శాఖ డైరెక్టర్ సృజన, కలెక్టర్ మల్లికార్జున, నగర పోలీస్ కమిషనర్ శ్రీకాంత్

- ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కరికాల వలవన్ ఆదేశం
- జీఐఎస్ నిర్వహణ కమిటీతో సమన్వయ సమావేశం

మహారాణిపేట: విశాఖ వేదికగా ఈ నెల 3, 4 తేదీల్లో నిర్వహిస్తున్న గ్లోబల్ ఇన్వెస్టర్స్ సమ్మిట్‌ను సమష్టి కృషితో విజయవంతం చేయాలని, ఎలాంటి సమన్వయలోపం లేకుండా వ్యవహరించాలని ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి(పరిశ్రమలు, వాణిజ్యం) ఆర్.కరికాల వలవన్ అధికారులను ఆదేశించారు. గ్లోబల్ ఇన్వెస్టర్స్ సమ్మిట్ నిర్వహణ ఏర్పాట్లపై కలెక్టరేట్ సమావేశ మందిరంలో మంగళవారం సమన్వయ కమిటీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా కరికాల వలవన్ మాట్లాడుతూ ప్రపంచ నలుమూలల నుంచి వచ్చే అతిథుల మనసు గెలిచేలా ప్రతి ఒక్కరూ వ్యవహరించాలని సూచించారు. మర్యాదపూర్వకమైన ప్రవర్తనతో వారిని స్వాగతించాలని, వేదికలను చూపించడంలో వారికి సహకరించాలని చెప్పారు. సదస్సు నిర్వహణకు సంబంధించిన బాగానే ప్రణాళికలు రూపొందించారని, వాటి ఆచరణలో కూడా ఇదే స్ఫూర్తిని కొనసాగించాలన్నారు. ఈ సదస్సు మన దేశానికి, రాష్ట్రానికి, మన ప్రాంతానికి ప్రత్యేక గుర్తింపు తీసుకొస్తుందని.. దీనిని దృష్టిలో ఉంచుకుని సమన్వయంతో విధులు నిర్వర్తించాలన్నారు. ఇప్పటివరకు ప్రైవేట్ భాగస్వామ్యంతో సమ్మిట్లు జరిగాయని.. ఈ సదస్సు రాష్ట్ర ప్రభుత్వ చొరవతో జరుగుతోందని గుర్తు చేశారు.

కమిటీలు, నోడల్ అధికారులను నియమించాం

కలెక్టర్ ఎ.మల్లికార్జున సదస్సుకు సంబంధించి ఇప్పటివరకు తీసుకున్న నిర్ణయాలు, చేసిన ఏర్పాట్లపై మాట్లాడారు. రిజిస్ట్రేషన్ ప్రక్రియ నుంచి సదస్సు ముగిసే వరకు చేపట్టాల్సిన విధులను పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. ప్రధాన సమావేశ మందిరం, ముఖ్యమంత్రికి కేటాయించిన సభాస్థలం, స్టాళ్లు ఇతర వసతుల గురించి తెలిపారు. వీఐపీలు బస చేసేందుకు హోటళ్ల ఏర్పాట్లు చేశామని, వాహనాలు నిలిపేందుకు పార్కింగ్ సదుపాయం కల్పించామన్నారు. టైమ్స్ నెట్‌వర్క్, ఇతర ఈవెంట్ మేనేజ్‌మెంట్లు వారి చేయాల్సిన పనులు, నోడల్ ఆఫీసర్లకు అప్పగించిన బాధ్యతలను వివరించారు. అతిథులను హోటళ్ల నుంచి వేదిక వద్దకు తీసుకొచ్చే విధంగా ప్రత్యేక బృందాలను నియమించామన్నారు. ఆయా చోట్ల వైద్య బృందాలు అందుబాటులో ఉంటాయన్నారు. ఎయిర్, సాధారణ అంబులెన్స్‌లు సిద్ధం చేసినట్లు చెప్పారు. అతిథులకు స్థానిక పర్యాటక ప్రాంతాల గురించి వివరించేలా ప్రత్యేక స్టాల్ ఏర్పాటు చేశామన్నారు. పరిశ్రమల శాఖ డైరెక్టర్ సృజన, సీపీ శ్రీకాంత్, జేసీ విశ్వనాథన్, వివిధ ఈవెంట్ మేనేజ్‌మెంట్ల ప్రతినిధులు, వివిధ విభాగాల అధికారులు పాల్గొన్నారు.

సమన్వయంతో పనిచేయండి

బీచ్‌రోడ్డు: అధికారులందరూ సమన్వయంతో పనిచేసి గ్లోబల్ ఇన్వెస్టర్స్–2023 సమ్మిట్(జీఐఎస్)ను విజయవంతం చేయాలని కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున అధికారులను ఆదేశించారు. వీఎంఆర్డీఏ చిల్డ్రన్ ఎరీనాలో మంగళవారం గ్లోబల్ ఇన్వెస్టర్స్–2023 సమ్మిట్ ఏర్పాట్లు, అధికారుల విధులపై పరిశ్రమల శాఖ డైరెక్టర్ డాక్టర్ జి.సృజన, జేసీ కె.ఎస్.విశ్వనాథన్‌తో కలసి సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అధికారులకు కేటాయించిన విధులను సమర్థవంతంగా నిర్వహించాలని కోరారు. పరిశ్రమల శాఖ డైరెక్టర్ సృజన మాట్లాడుతూ అధికారులందరూ ప్రధాన వేదిక పూర్తి వివరాలను ముందుగానే తెలుసుకోవాలన్నారు.

పరిశ్రమల స్థాపనకు విశాఖ అనుకూలం

మేయర్ గొలగాని హరివెంకటకుమారి

మహారాణిపేట: దేశంలో ఆంధ్రప్రదేశ్ అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతోందని మేయర్ గొలగాని హరివెంకటకుమారి అన్నారు. మద్దిలపాలెంలోని వైఎస్సార్ సీపీ కార్యాలయంలో మంగళవారం ఆమె మీడియాతో మాట్లాడారు. రాష్ట్రంలో.. మరీ ముఖ్యంగా విశాఖలో పరిశ్రమల స్థాపనకు అనువైన వాతావరణం ఉందన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నాయకత్వంలో ఏపీ అభివృద్ధిలో దూసుకుపోతోందన్నారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో ఈ మూడేళ్లలో ఎంఎస్ఎంఈ యూనిట్ల సంఖ్య 60 శాతం పెరిగిందన్నారు. ఉద్యోగ కల్పనలో 38 శాతం పెరుగుదల నమోదు కావడం మంచి పరిణామన్నారు. రాష్ట్రంలో పెట్టుబడులు పెడుతున్న పారిశ్రామికవేత్తలకు ప్రభుత్వం ప్రాధాన్యమివ్వడంతో పాటు ప్రత్యేక రాయితీలు కల్పిస్తోందన్నారు. మీడియా సమావేశంలో డిప్యూటీ మేయర్లు కె.సతీష్, జియ్యాని శ్రీధర్, వైఎస్సార్ సీపీ ఫ్లోర్‌లీడర్ బానాల శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ భవనంలో స్కిల్ సెంటర్!

- ఏర్పాటు చేయనున్న చమురు సంస్థలు
- నిర్వహణ బాధ్యత చూడనున్న హెచ్‌పీసీఎల్
- బిల్డింగ్ విస్తీర్ణం 84 వేల చదరపు అడుగులు
- పుష్కర కాలం నుంచి వృథాగా ఐదంతస్తుల భవనం
- అద్దె ద్వారా నెలకు రూ.11.60 లక్షల ఆదాయం



ద్వారకా బస్‌స్టేషన్‌లో ఆర్టీసీ భవనం

సాక్షి, విశాఖపట్నం: ఆర్టీసీకి చెందిన ఐదంతస్తుల ఆ భవనం ఒకప్పుడు ప్రభుత్వ, ప్రైవేటు సంస్థల కార్యాలయాలతో కళకళలాడుతూ ఉండేది. పుష్కర కాలం నుంచి ఖాళీగా, వృథాగా ఉంది. నిర్వహణ లేక శిథిలావస్థకు చేరుకుంటోంది. గతంలో ఖాళీగా ఉన్న ఆ బిల్డింగ్‌ను అద్దెకు తీసుకోవడానికి పలు సంస్థలు, ఆస్పత్రుల యాజమాన్యాలు ఆసక్తి కనబరిచాయి. కానీ భవనం కింద ఫ్లోర్‌లో వాణిజ్య దుకాణాలు, దక్షిణం వైపున ద్వారకా బస్‌స్టేషన్, ఉత్తరం దిక్కులో ఓ పెద్ద జ్యుయలరీ షాపు ఉన్నాయి. దీంతో అంత పెద్ద భవనానికి పార్కింగ్ సదుపాయం లేకుండా పోయింది. ఫలితంగా పార్కింగ్ సమస్య వల్ల ఇన్నాళ్లూ ఇది నిరుపయోగంగా ఉంది. ఈ నేపథ్యంలో ఈ భవనంలో స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్ ఏర్పాటుకు భారతీయ చమురు సంస్థలు సంయుక్తంగా ముందుకొచ్చాయి. ఐఓసీఎల్, హెచ్‌పీసీఎల్, బీపీసీఎల్, ఓఐఎల్, ఓఎన్‌జీసీ తదితర చమురు సంస్థలు తమ సీఎస్సార్ (కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ) నిధులతో దేశంలోని వివిధ నగరాల్లో ఇలాంటి నైపుణ్యాభివృద్ధి కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నాయి. విశాఖలోనూ ఈ సెంటర్‌ను నడపడం కోసం ఈ బిల్డింగ్‌ను ఎంపిక చేసుకుంది. ఈ సెంటర్‌కు వచ్చే వారు విద్యార్థులే కావడంతో పార్కింగ్ సదుపాయం అంతగా అవసరం లేదు. దీంతో నగర నడిబొడ్డున, రవాణా సదుపాయం ఉన్న ఈ సువిశాల భవనం తమ స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్‌కు అనువుగా ఉంటుందన్న ఉద్దేశంతో చమురు సంస్థలు లీజు ఒప్పందం కుదుర్చుకున్నాయి. ఈ సెంటర్ నిర్వహణ బాధ్యతను విశాఖ హెచ్‌పీసీఎల్ చూసుకుంటుందని తెలుస్తోంది.

85 వేల చదరపు అడుగులు

ద్వారకా బస్‌స్టేషన్ స్థలంలో దాదాపు 40 ఏళ్ల క్రితం ఆర్టీసీ నిర్మించిన ఐదంతస్తుల ఈ భవనం విస్తీర్ణం సుమారు 84 వేల చదరపు అడుగులు. ఈ భవనానికి చదరపు అడుగుకు నెలకు రూ.13.89 చొప్పున అద్దె చెల్లించేలా చమురు సంస్థలతో ఒప్పందం కుదిరింది. ఈ లెక్కన అద్దె ద్వారా ఆర్టీసీకి నెలకు రూ.11.60 లక్షల ఆదాయం సమకూరనుంది. ఈ భవనం లీజు ఒప్పందం పదేళ్ల పాటు ఉంటుంది.

అవసరమైన పనులు మొదలు



ఈ ఆర్టీసీ భవనాన్ని చమురు సంస్థలకు అప్పగించడానికి ముందు కనీస సదుపాయాలను కల్పించాల్సి ఉంది. విద్యుత్ సదుపాయం, నీటి సరఫరా, డ్రెయినేజీ వంటి వాటిని సమకూర్చడంతో పాటు అవసరమైన పనులు మొదలు పెట్టాం. మరో నాలుగైదు నెలల్లో ఈ భవనం అందుబాటులోకి వచ్చే అవకాశం ఉంది.

–ఎ.అప్పలరాజు, జిల్లా ప్రజా రవాణా అధికారి

విస్కో సామాజిక బాధ్యత

నగర పోలీస్ శాఖకు రూ.27లక్షల విలువగల రెండు వాహనాల అందజేత



బీచ్ పెట్రోలింగ్ వాహనాలు ప్రారంభిస్తున్న జీవీఎంసీ కమిషనర్ రాజాబాబు, సీపీ శ్రీకాంత్

అల్లిపురం: జీవీఎంసీ సహకారంతో సామాజిక బాధ్యతలో భాగంగా విశాఖపట్నం ఇండస్ట్రీయల్ వాటర్ సప్లయ్ కంపెనీ(విస్కో) రూ.27.23 లక్షల విలువ గల రెండు బీచ్ పెట్రోలింగ్ వాహనాలను అందజేసింది. నగర పోలీస్ కమిషనరేట్‌లో మంగళవారం నిర్వహించిన కార్యక్రమంలో సీపీ సీహెచ్.శ్రీకాంత్‌తో కలసి జీవీఎంసీ కమిషనర్ పి.రాజాబాబు జెండా ఊపి ఈ వాహనాలు ప్రారంభించారు. ఈ సందర్భంగా జీవీఎంసీ కమిషనర్ మాట్లాడుతూ సీపీ విజ్ఞప్తి మేరకు విస్కో ప్రతినిధులు బీచ్ పెట్రోలింగ్ నిమిత్తం రెండు వాహనాలు అందజేశారన్నారు. బీచ్ పెట్రోలింగ్‌తో పాటు పర్యాటకుల రక్షణకు ఈ వాహనాలు ఎంతగానో ఉపయోగపడతాయన్నారు. ఈ సందర్భంగా వారు విస్కో ప్రతినిధులకు కృతజ్ఞతలు తెలిపారు.

ఆంధ్రజ్యోతిపై పరువు నష్టం కేసు విచారణ వాయిదా

విశాఖలీగల్: ఓ దినపత్రిక యజమానిపై అభ్యంతరకర రాతలు రాసిన ఆంధ్రజ్యోతిపై దాఖలైన పరువు నష్టం కేసు విచారణ వాయిదా పడింది. తదుపరి విచారణ నిమిత్తం నగరంలోని ఒకటవ అదనపు ప్రధాన మెట్రోపాలిటన్ మేజిస్ట్రేట్ కోర్టు న్యాయమూర్తి యుగంధర్ ఈ నెల 17వ తేదీకి వాయిదా వేశారు. ఈ కేసులో వాస్తవం లేదని తమపై కేసు తొలగించాలని పేర్కొంటూ ఆంధ్రజ్యోతి యాజమాన్యం రాష్ట్ర హైకోర్టును ఆశ్రయించింది. ఈ కేసు విచారణ ఏప్రిల్ 10వ తేదీన జరగనుంది.

వావ్..వైజాగ్..!



గ్లోబల్ ఇన్వెస్టర్స్ సమ్మిట్ (జీఐఎస్)కు నగరం ముస్తాబవుతోంది. రోడ్లు కళకళలాడుతున్నాయి. భవనాలు కొత్తందాన్ని సంతరించుకుంటున్నాయి. డివైడర్లు రంగులద్దుకుంటున్నాయి. ఇవన్నీ ఇప్పుడు నగర వాసులకే కాదు.. ఇతర ప్రాంతాల నుంచి సిటీకి వచ్చే వారిని ఆశ్చర్య చకితులను, మంత్ర ముగ్ధులను చేస్తున్నాయి. ఔరా! వైజాగ్ అనిపిస్తున్నాయి. - సాక్షిఫొటోగ్రాఫర్, విశాఖపట్నం

శభాష్ పోలీస్..



బ్యాగ్‌ను న్యాయవాదికి అందజేస్తున్న పోలీసులు

పోగొట్టుకున్న బ్యాగ్ హైకోర్టు న్యాయవాదికి అప్పగింత

దాబాగార్డెన్స్: పోగొట్టుకున్న నగదు బ్యాగ్‌ను కనుగొని, ఆ వ్యక్తికి అందించి, ప్రశంసలందుకున్నారు వన్‌టౌన్ పోలీసులు. వివరాలివి.. ఐదు రోజుల కిందట వన్‌టౌన్ పోలీస్ స్టేషన్ పరిధి ఏవీఎన్ కాలేజ్ డౌన్‌రోడ్డులో చిట్టెల వెంకటరమణ అనే హైకోర్టు న్యాయవాది తన బ్యాగ్‌ను ఓ బైక్‌పై పెట్టి మరచిపోయారు. అందులో రూ.30వేల నగదు, 2 మొబైల్స్, ఐడీ కార్డులు, ముఖ్యమైన డాక్యుమెంట్లు ఉన్నాయి. బ్యాగ్ పోయిన విషయాన్ని వన్‌టౌన్ పోలీస్ స్టేషన్ క్రైమ్ స్టాఫ్ పీసీ రాజు, సూర్యనారాయణ దృష్టికి న్యాయవాది తీసుకెళ్లారు. వెంటనే స్పందించిన పోలీసులు ఆ ఏరియాలోని సీసీ కెమెరాలు చెక్ చేశారు. సాక్షికంగా వచ్చిన ఫుటేజ్ ఆధారంగా పరిసర ప్రాంతాల్లో ఎంక్వైరీ చేసి ఆయన బ్యాగ్ ట్రేస్ చేశారు. వస్తువులతో కలిపి బ్యాగ్‌ను ఆయనకు అప్పగించారు.

పరిశోధనలపై ఆసక్తి చూపాలి

- డీఈవో చంద్రకళ
- తోటగరువు హైస్కూల్లో సైన్స్ ఎగ్జిబిషన్ ప్రారంభం



తోటగరువు హైస్కూల్‌లో సైన్స్ ఎగ్జిబిషన్‌ను ప్రారంభిస్తున్న డీఈవో చంద్రకళ



హైపర్ లూప్ ప్రదర్శనతో తొమ్మిదో తరగతి విద్యార్థులు



చైనా బ్రిడ్జి ప్రాజెక్టును ప్రదర్శిస్తున్న ఎనిమిదో తరగతి విద్యార్థులు

ఆరిలోవ: విద్యార్థులు పరిశోధనలపై ఆసక్తి చూపాలని జిల్లా విద్యాశాఖాధికారి ఎల్.చంద్రకళ సూచించారు. జాతీయ సైన్స్ దినోత్సవాన్ని పురస్కరించుకుని తోటగరువు జిల్లా పరిషత్ హైస్కూల్లో ప్రధానోపాధ్యాయిని జి.కె.డి దుర్గాభవాని ఆధ్వర్యంలో వైజ్ఞానిక ప్రదర్శన నిర్వహించారు. ముందుగా డీఈవో ఎల్. చంద్రకళ సైన్స్ ఎగ్జిబిషన్‌ను ప్రారంభించారు. సి.వి. రామన్ చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు.

6 పాఠశాలలు.. 107 ప్రాజెక్టులు

ఎగ్జిబిషన్‌కు తోటగరువు హైస్కూల్‌తో పాటు పెందుర్తి, నడుపూరు, కణితి, మల్కాపురం, అగనంపూడి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల నుంచి విద్యార్థులు హాజరై, ప్రాజెక్టులు ప్రదర్శించారు. తోటగరువు ఉన్నత పాఠశాలలో 6 నుంచి 9 తరగతుల విద్యార్థులు రూపొందించిన 82 ప్రాజెక్టులు, మిగిలిన పాఠశాలల నుంచి తీసుకువచ్చిన 25 ప్రాజెక్టులు ఎగ్జిబిషన్‌లో ప్రదర్శించారు. హైపర్ లూప్, చైనా వాటర్ బ్రిడ్జి, క్విజ్ బోర్డు, గ్లోబల్ వార్మింగ్, టిస్లా ఆయిల్ ప్రాజెక్ట్, వర్మి కంపోస్ట్, గ్రీన్ హౌస్, కన్సర్వేషన్ ఆఫ్ ఎనర్జీ అగ్రికల్చర్, పోషకాహారానికి సంబంధించిన ప్రాజెక్టులు సందర్శకులను ఆకట్టుకున్నాయి. విద్యార్థులు తయారు చేసిన ప్రాజెక్టులను డీఈవో ఆసక్తిగా తిలకించారు. విద్యార్థులు ప్రదర్శించిన ప్రాజెక్టులను ఎలా తయారు చేశారు? వాటి పని తీరు, ఉపయోగాలు తదితర విషయాలను అడిగి తెలుసుకున్నారు. ఆ విద్యార్థులను అభినందించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం విద్యకు అధిక ప్రాధాన్యం ఇస్తోందన్నారు. నాణ్యమైన, శాస్త్రీయమైన విద్యను అందించడానికి కృషి చేస్తోందన్నారు. ఇందులో భాగంగా ప్రతి పాఠశాలలో సైన్స్ ల్యాబ్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. పాఠశాలల్లో విద్యార్థులు పరిశోధనలు చేయడానికి ఉపాధ్యాయులు ప్రోత్సాహం అందించాలని కోరారు. కార్యక్రమంలో సమగ్ర శిక్షణ అభియాన్ ఏపీసీ శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ప్రభుత్వ ఉద్యోగుల సంఘ జిల్లా కార్యాలయం ప్రారంభం



జిల్లా కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న ఏపీజీఈఏ రాష్ట్ర అధ్యక్షుడు సూర్యనారాయణ

మద్దిలపాలెం: ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం విశాఖ జిల్లా కార్యాలయాన్ని పిఠాపురంకాలనీలో మంగళవారం ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కె.ఆర్.సూర్యనారాయణ ప్రారంభించారు. జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఎస్.వి.రమణ, రవిశంకర్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ కార్యాలయంలో ఉమ్మడి విశాఖ జిల్లా కార్యకలాపాలు కొనసాగుతాయని సూర్యనారాయణ తెలిపారు. ప్రణాళికబద్ధంగా సంఘం బలోపేతానికి చర్యలు చేపట్టాలని సూచించారు. సంఘ రాష్ట్ర కార్యదర్శి జవహర్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు రఘుబాబు తదితరులు పాల్గొన్నారు.

చికెన్ ధరలు

చికెన్ (కిలో) (వెన్‌కాబ్)

బ్రాయిలర్ (లైవ్)	: రూ.110
స్కిన్	: రూ.190
స్కిన్‌లెస్	: రూ.200

విశాఖ బులియన్

24 క్యారెట్స్(10 గ్రా.)	రూ.56,120
22 క్యారెట్స్(10 గ్రా.)	రూ.51,450
వెండి(కిలో):	రూ.69,200

కోడిగుడ్ల ధరలు

	రూ.లలో (వందకు)
విశాఖ	415.00
విజయనగరం	419.00
శ్రీకాకుళం	419.00

'ఐ లవ్ ఏఎంసీ' ఐకాన్ ఆవిష్కరణ



ఐకాన్‌ను ఆవిష్కరించిన హెల్త్ వర్సిటీ వీసీ డాక్టర్ బాబ్జీ. చిత్రంలో ఏఎంసీ ప్రిన్సిపాల్ డాక్టర్ బుచ్చిరాజు తదితరులు

మహారాణిపేట(విశాఖ దక్షిణ): ఆంధ్ర మెడికల్ కళాశాల శతాబ్ది ఉత్సవాలను పురస్కరించుకుని రూపొందించిన ఐ లవ్ ఏఎంసీ ఐకాన్‌ను డాక్టర్ వైఎస్సార్ యూనివర్సిటీ ఆఫ్ హెల్త్ సైన్సెస్ వీసీ డాక్టర్ కె.బాబ్జీ ఆవిష్కరించారు. మెడికల్ కాలేజీలో మంగళవారం నిర్వహించిన 100వ ఫ్రెషర్స్ డే వేడుకలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై, మాట్లాడారు. ఏఎంసీ ఘనకీర్తికి కారకులైన వైద్యులను, వారి సేవలను కొనియాడారు. కార్యక్రమంలో ఏఎంసీ ప్రిన్సిపాల్ డాక్టర్ జి.బుచ్చిరాజు, కేజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ పి.అశోక్‌కుమార్, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ వి.మన్మథరావు, ఫిజియాలజీ హెచ్‌వోడీ డాక్టర్ ఎం.ఉషారాణి తదితరులు ప్రసంగించారు. ఏఎంసీ వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ రాజేంద్ర ప్రసాద్, కల్చరల్ వైస్ ప్రెసిడెంట్ డాక్టర్ ఎం.పార్వతి తదితరులు పాల్గొన్నారు.

నెల్లూరు నుంచి విశాఖకు ఖైదీ తరలింపు

ఆరిలోవ: యావజ్జీవ శిక్ష పడిన ఓ ఖైదీని నెల్లూరు కేంద్ర కారాగారం నుంచి విశాఖ కేంద్ర కారాగారానికి తీసుకొచ్చారు. నెల్లూరు ప్రాంతానికి చెందిన మనోహర్ అనే వ్యక్తి సుమారు పదేళ్ల క్రితం రాజమండ్రి సమీపంలో శ్రీలక్ష్మి అనే ఇంజనీరింగ్ విద్యార్థిని హత్య చేశాడు. ఈ కేసులో ఆయనకు యావజ్జీవ కారాగార శిక్ష పడింది. దీంతో ఆయన రాజమండ్రి కేంద్ర కారాగారంలో శిక్ష అనుభవించేవాడు. ఆయన మానసిక పరిస్థితి బాగాలేకపోవడంతో విశాఖలో వైద్య సేవలు అందించడానికి నాలుగేళ్ల క్రితం రాజమండ్రి నుంచి విశాఖ కేంద్ర కారాగారానికి జైలు అధికారులు తరలించారు. మనోహర్ ఆరోగ్యం బాగుపడడంతో రెండేళ్ల క్రితం విశాఖ నుంచి నెల్లూరు కారాగారానికి తరలించారు. మళ్లీ ఇప్పుడు ఆయన మానసిక స్థితి బాగోలేకపోవడంతో నెల్లూరు జైలు నుంచి విశాఖ కేంద్ర కారాగారానికి అక్కడ పోలీసులు తీసుకొచ్చినట్లు జైల్ అధికారులు తెలిపారు.

క్రైం కార్నర్

ప్రాణం తీసిన అతివేగం

- రోడ్డు ప్రమాదంలో ఇంజినీరింగ్ విద్యార్థి దుర్మరణం
- మరొకరికి తీవ్ర గాయాలు



తీవ్రంగా గాయపడిన కార్తీక్



సంఘటన స్థలం వద్ద శివప్రసాద్ మృతదేహం (ఇన్‌సెట్) శివప్రసాద్ (ఫైల్)

ఆనందపురం : అతివేగం ఓ ఇంజినీరింగ్ విద్యార్థిని బలి తీసుకుంది. బైక్‌పై సరదాగా చేసిన ప్రయాణమే ఆఖరి మజిలీ అయింది. మండలంలోని పెద్దిపాలెం జాతీయ రహదారిపై సోమవారం రాత్రి ఒంటి గంట ప్రాంతంలో ద్విచక్రవాహనం అదుపు తప్పి రోడ్డు డివైడర్‌ని ఢీకొన్న సంఘటనలో ఓ ఇంజినీరింగ్ విద్యార్థి దుర్మరణం పాలయ్యాడు. మరో విద్యార్థి తీవ్రంగా గాయపడ్డాడు. ఎస్ఐ నరసింహమూర్తి తెలిపిన వివరాలివీ.. మన్యం పార్వతీపురం జిల్లా, గరుగుబిల్లి మండలం, శివ్వాం గ్రామానికి చెందిన పెద్దింటి శివప్రసాద్ (20) గోపాలపట్నానికి సమీపంలోని నరవలో ఉన్న ఓ ఇంజినీరింగ్ కళాశాలలో బీటెక్ ద్వితీయ సంవత్సరం చదువుతున్నాడు. నగరంలోని ఊర్వశి జంక్షన్ వద్ద గది అద్దెకు తీసుకొని అక్కడ నుంచి రోజు కళాశాలకు రాకపోకలు సాగిస్తున్నాడు. మన్యం పార్వతీపురం జిల్లా జియ్యమ్మవలస మండలం శిఖబడి గ్రామానికి చెందిన పాండ్రంగి కార్తీక్ బీటెక్ మధ్యలోనే ఆపేశాడు. శివప్రసాద్‌తో ఉంటూ పోటీ పరీక్షలకు సన్నద్ధమవుతున్నాడు. కార్తీక్ ఇటీవల డ్యూక్ బైక్ కొనుక్కున్నాడు. సోమవారం సాయంత్రం విజయనగరం జిల్లా, జామిలో జరుగుతున్న యల్లమ్మ జాతరకు స్నేహితులిద్దరు మోటార్ బైక్‌పై వెళ్లారు. తిరిగి వస్తున్న క్రమంలో కార్తీక్ బైక్ నడుపుతుండగా వెనుక వైపు శివప్రసాద్ కూర్చున్నాడు. పెద్దిపాలెం వద్దకు చేరుకునేసరికి మోటార్ బైక్ అదుపు తప్పి మధ్యలో ఉన్న డివైడర్‌ని ఢీకొట్టింది. ఈ సంఘటనలో మోటార్ బైక్ వెనుక వైపు కూర్చున్న శివప్రసాద్ తూలి అవతల వైపు రోడ్డు పై పడడంతో తీవ్రంగా గాయపడ్డాడు. ఈలోగా విశాఖ నుంచి విజయనగరం వెళ్తున్న గుర్తు తెలియని వాహనం శివప్రసాద్‌ని కొంత దూరం ఈడ్చుకొని పోవడంతో శరీరం ఛిద్రమై అక్కడికక్కడే మృతి చెందాడు. తీవ్రంగా గాయపడిన కార్తీక్ కేజీహెచ్‌లో చికిత్స పొందుతున్నాడు. ఎస్ఐ పి.నరసింహమూర్తి సంఘటన స్థలానికి చేరుకుని పరిశీలించారు. మితిమీరిన వేగం వల్లే ప్రమాదం జరిగినట్లు గుర్తించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతుడు తండ్రి వెంకునాయుడు తాపీ మేస్త్రీగా పని చేస్తున్నారు. తల్లి పార్వతి గృహిణి. సోదరి ఎంఎస్సీ చదువుతోంది.

ఆటోను ఢీకొన్న కారు

మహిళ మృతి, ఇద్దరికి తీవ్ర గాయాలు



మృతి చెందిన వెంకటలక్ష్మి



బోల్తా పడిన ఆటో



గాయాల పాలైన ఆటో డ్రైవర్ శ్రీనివాసరావు

ఆనందపురం: మండలంలోని పెద్దిపాలెం జాతీయ రహదారిపై మంగళవారం ఉదయం ఆటోను కారు ఢీకొన్న సంఘటనలో ఓ మహిళ మృతి చెందగా, మరో ఇద్దరు గాయపడి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. ఎస్ఐ శ్యామ్ సుందర్ తెలిపిన వివరాలివీ. భీమిలి మండలం అవనాం గ్రామానికి చెందిన చిల్ల వెంకటలక్ష్మి (47) అనారోగ్యానికి గురైంది. నగరంలోని ఆస్పత్రిలో వైద్యం చేయించుకోవడానికి తన కూతురైన భవానీని తోడు తీసుకొని ఆటోపై బయలు దేరింది. ఆ ఆటో పెద్దిపాలెం గ్రామానికి సమీపంలో జాతీయ రహదారి పైకి చేరుకునే సరికి వెనుక నుంచి వస్తున్న కారు ఢీ కొట్టింది. ఈ సంఘటనలో ఆటో బోల్తా పడటంతో వెంకటలక్ష్మి, భవానీతోపాటు ఆటో డ్రైవర్ చందవు శ్రీనివాసరావు కూడా గాయాలయ్యాయి. వారిని చికిత్స కోసం తగరపువలస ఎస్ఆర్ఐ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ వెంకటలక్ష్మి మృతి చెందింది. కేసును ఎస్ఐ శ్యామ్ సుందర్ నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

హత్య కేసులో వీడిన మిస్టరీ

- యువతిని చంపి డ్రమ్ములో సీల్ వేసిన నిందితుడు
- హతురాలు శ్రీకాకుళం జిల్లా వాసి
- తాత డీఎన్ఏతో గుర్తించిన పోలీసులు



బొమ్మిడి ధనలక్ష్మి(ఫైల్)



నిందితుడు రిషివర్ధన్ (ఫైల్)

పీఎంపాలెం: పీఎంపాలెం పోలీస్‌స్టేషన్ పరిధి కొమ్మాది వికలాంగుల కాలనీలో జరిగిన హత్య కేసు మిస్టరీ వీడింది. డ్రమ్ములో హత్యకు గురైన యువతి వివరాలను పీఎంపాలెం పోలీసులు కనుగొన్నారు. ఆ యువతి శ్రీకాకుళం జిల్లాకు చెందిన బొమ్మిడి ధనలక్ష్మిగా గుర్తించారు. వివరాలివీ..

కొమ్మాది వికలాంగులకాలనీకి చెందిన నందూరి రమేష్ శ్రీకాకుళం జిల్లా పాలకొండ ప్రాంతానికి చెందిన రిషివర్ధన్(25)కు 2019 డిసెంబరులో తన ఇంటిని అద్దెకు ఇచ్చాడు. రిషివర్ధన్‌ను తనకున్న వెల్డింగ్ షాపులో పనికి పెట్టుకున్నాడు. ఇదిలా ఉండగా రిషి తన భార్యను 2020 ఫిబ్రవరిలో శ్రీకాకుళంలోని ఆమె పుట్టింటికి పంపించాడు. రమేష్ అనారోగ్యం కారణంగా అద్దె ఇంటి గురించి కొంత కాలం పట్టించుకోలేదు. రిషి కూడా అద్దె చెల్లించడం మానేశాడు. రిషికి ఫోను చేసినా సమాధానం వచ్చేది కాదు. కాగా.. ఇంటికి అధిక మొత్తంలో కరెంట్ బిల్లు రావడంతో 2022 డిసెంబర్ 4న రమేష్ కొంతమందిని వెంట తీసుకుని అద్దె ఇంటికి వెళ్లాడు. ఇంట్లో ఎవరూ లేకపోయినా దీపాలు వెలుగుతున్నట్లు గుర్తించాడు. ఇంటి వరండాలో ఓ పక్కన సీల్ వేసిన డ్రమ్ము నుంచి దుర్వాసన రావడంతో తెరచి చూస్తే అందులో కుళ్లిపోయిన యువతి మృతదేహం ఉంది. దాదాపుగా అస్థి పంజరంలా ఉంది. ఈ విషయాన్ని పోలీసులకు సమాచారం అందించడంతో.. అదే రోజు కేసు నమోదు చేశారు. 24 గంటల వ్యవధిలోనే నార్త్ ఏసీపీ సీహెచ్ శ్రీనివాసరావు పర్యవేక్షణలో నిందితుడు రిషివర్ధన్‌ను అదుపులోకి తీసుకున్నారు. రిమాండ్‌కు తరలించారు. కాగా.. నిందితుడు రిషి ఆ యువతిని అప్పుడప్పుడు రూమ్‌కు రప్పించుకునేవాడు. ఇద్దరి మధ్య ఘర్షణ జరగడంతో ఆగ్రహంతో ఆమెను చంపి.. డ్రమ్ములో కుక్కి పైన సీల్ వేశాడు. ఏడాదిన్నర వరకు విషయం వెలుగులోకి రాలేదు. అయితే ఆ యువతి వివరాలు నిందితుడికి కూడా తెలియక పోవడంతో ఈ కేసు మిస్టరీగా మారింది. పోలీసులు అక్కడితో కేసు విచారణ ఆపలేదు. రిషి కాల్ డేటా ఆధారంగా దర్యాప్తు చేపట్టి.. చనిపోయిన యువతి శ్రీకాకుళం జిల్లాకు చెందిన బొమ్మిడి ధనలక్ష్మిగా గుర్తించారు. మృతురాలి తాత డీఎన్ఏతో సరిపోవడంతో ఈ కేసు ఓ కొలిక్కి వచ్చింది. అత్యంత క్లిష్టమైన ఈ కేసును ఛేదించడంలో విశేష కృషి చేసిన నార్త్ ఏసీపీ సీహెచ్ శ్రీనివాసరావు, సీఐ రామకృష్ణను పోలీస్ ఉన్నతాధికారులు అభినందించారు.

క్రూడ్ వేస్ట్ ఆయిల్ పంపింగ్ సమయంలో ఘటన

- హెచ్‌పీసీఎల్ అధికారుల నిర్ధారణ
- ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న కార్మికులు



ఘటనా స్థలం నుంచి తెల్లటి పొగతో వస్తున్న మంటలు



గాయపడిన వ్యక్తిని పరామర్శిస్తున్న సీఐ లూథర్‌బాబు

మల్కాపురం: హెచ్‌పీసీఎల్‌లో జరిగిన ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన ఇద్దరు కార్మికులు ఆరిలోవ వద్ద ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. ప్రస్తుతం వీరి పరిస్థితి నిలకడగా ఉందని అధికారులు తెలిపారు. హెచ్‌పీసీఎల్ (విశాఖ రిఫైనరీ) సంస్థలోని ఏటీపీ(అడిషనల్ ట్యాంక్స్ ప్రాజెక్ట్) వద్ద సోమవారం రాత్రి అగ్ని ప్రమాదం జరిగి, ఇద్దరు కార్మికులు తీవ్రంగా గాయపడిన సంగతి తెలిసిందే. ఇక్కడ క్రూడ్ ఆయిల్ పైపులైన్ లీక్ కారణంగా ప్రమాదం జరిగి ఉంటుందని తొలుత అందరూ భావించారు. అయితే క్రూడ్ వేస్ట్ ఆయిల్ పంపింగ్ సమయంలో అగ్ని ప్రమాదం జరిగిందని అధికారులు నిర్ధారించారు. ఈ ప్రమాదంలో పెందుర్తి, రాంపురం ప్రాంతానికి చెందిన చంద్రబాబు 60 శాతం కాలిపోయాడు. ఇతను టెక్నీషియన్. శాశ్వత ఉద్యోగి. 104 ఏరియా ప్రాంతానికి చెందిన జి.రమణ కాంట్రాక్ట్ కార్మికుడు(డ్రైవర్). 20 శాతం గాయపడ్డాడు. వీరిని ఆరిలోవ వద్ద ఓ ప్రైవేట్ ఆస్పత్రికి చికిత్స నిమిత్తం తరలించారు. చంద్రబాబుకు మూడు నెలల కిందటే వివాహం జరిగినట్లు తెలిసింది. ప్రమాదం జరిగినప్పుడు పెద్ద ఎత్తున తెల్లటి పొగతో కూడిన మంటలు రావడంతో.. ఆ సమయంలో అక్కడ పని చేస్తున్న మిగిలిన కార్మికులు ప్రాణభయంతో పరుగులు తీశారు. సంస్థ అధికారుల ద్వారా సమాచారం అందుకున్న మల్కాపురం సీఐ లూథర్‌బాబు ఘటన స్థలానికి వెళ్లి ప్రమాదంపై ఆరా తీశారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న క్షతగాత్రులను పరామర్శించారు. వారి నుంచి ప్రమాద వివరాలు తెలుసుకున్నారు. విచారణ అనంతరం ఈ ఘటనపై కేసు నమోదు చేస్తామని సీఐ తెలిపారు.

వెంకన్న కల్యాణానికి రేపే అంకురార్పణ



కొత్త రంగులతో ముస్తాబైన హంస, గజవాహనాలు



ప్రధాన రాజగోపురం ఎదురుగా భక్తులు సేద తీరేందుకు ఏర్పాటు చేసిన షెడ్లు

- పెండ్లికావిడి ఊరేగింపుతో ఉత్సవాలు ప్రారంభం
- 3వ తేదీ రాత్రి స్వామివారి కల్యాణం
- వేసవి తాపాన్ని తట్టుకునేలా టీటీడీ ఏర్పాట్లు

నక్కపల్లి: ఉత్తరాంధ్ర ప్రజల ఆరాధ్యదైవం ఉపమాక వేంకటేశ్వరస్వామి వార్షిక కల్యాణానికి గురువారం అంకురార్పణ జరగనుంది. గరుడాద్రి పర్వతంపై కల్కి అవతారంలో వెలసిన శ్రీదేవి భూదేవి సమేత శ్రీవేంకటేశ్వరస్వామికి మార్చి 3వ తేదీ శుక్రవారం రాత్రి వార్షిక కల్యాణం ఘనంగా నిర్వహిస్తారు. ముందురోజు గురువారం ఉదయం 9.45 గంటలకు స్వామివారి కల్యాణోత్సవాలకు అందరూ ఆహ్వానితులేనంటూ పెండ్లి కావిడిని మాడ వీధుల్లో ఊరేగిస్తారు. భక్తులు స్వామివారికి పసుపు కుంకుమలు, కొబ్బరికాయలు కానుకగా సమర్పిస్తారు. సాయంత్రం అంకురార్పణ చేస్తారు. రాత్రి 7 గంటలకు సుదర్శన పెరుమాళ్లను పల్లకిలో ఉంచి మత్సంగ్రహణం (పుట్టమన్ను) తీసుకురావడానికి ఉత్తర ఈశాన్య దిక్కు గల ప్రాంతానికి తీసుకెళతారు. స్వామిని, అమ్మవార్లను అశ్వవాహనంలో ఉంచి మాడవీధుల్లో తిరువీధి సేవ నిర్వహిస్తారు. కల్యాణ మండపంలో స్వామి, అమ్మవార్లను ఉంచి అంకురార్పణ చతుస్థాన అర్చనలు, గరుడప్పాల నివేదన నిర్వహిస్తారు. దీంతో స్వామివారి కల్యాణోత్సవాలు ప్రారంభమయినట్లేనని ప్రధానార్చకులు గొట్టుముక్కల వరప్రసాద్ తెలిపారు.

వేసవి తాపాన్ని తట్టుకునేలా ఏర్పాట్లు

వేసవి కాలం సమీపించడం, ఎండ వేడిమి ప్రారంభం కావడంతో భక్తులకు ఎటువంటి ఇబ్బంది కలగకుండా స్వామివారి కల్యాణోత్సవాలకు నిర్వహించేందుకు తిరుమల తిరుపతి దేవస్థానం వారు అన్ని ఏర్పాట్లు చేశారు. దర్శనానికి వచ్చే భక్తుల కోసం క్యూకాంప్లెక్స్‌లు, బారికేడ్ల నిర్మాణం, షామియానాలు, జర్మన్ టెంట్లు వేసే కార్యక్రమం పూర్తయింది. భక్తులకు ఇబ్బంది లేకుండా ప్రధాన రాజగోపురం బయట విశాలమైన పెద్ద షెడ్డు వేశారు. ఆలయం లోపల భక్తులు ప్రదక్షిణలు చేసే ఆస్థాన మండపం, బేడామండపాల్లో టెంట్లు, పందిళ్లు ఏర్పాటు చేశారు. నాచు, పూడిక తీతపనులు చేపట్టి పుష్కరిణి శుభ్రం చేశారు. రక్షణ గ్రిల్స్ ఏర్పాటు చేశారు. స్వామివారి తిరువీధి సేవల కోసం ఉపయోగించే వివిధ వాహనాలకు ఆకర్షణీయమైన రంగులు వేశారు. మెట్లమార్గంలో రెయిలింగ్, మాడవీధుల్లో ప్రత్యేకంగా విద్యుద్దీపాలు ఏర్పాటు చేశారు. షెడ్లలో భక్తులు సేద తీరేందుకు గ్రీన్ మ్యాట్‌లు వేస్తున్నారు. మరుగుదొడ్లు, తాగునీటి సదుపాయం ఏర్పాటు చేశారు.

అత్యాచారానికి యత్నించిన వ్యక్తి మృతి

భీమునిపట్నం: బాలికపై అత్యాచారానికి యత్నించిన వ్యక్తి ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందాడు. ఇక్కడ అప్పికొండ వీధిలో ఉంటున్న కాళ్ల కృష్ణ(55) గత 22న ఐదేళ్ల బాలికపై అత్యాచారయత్నానికి పాల్పడగా.. బాలిక కేకలు వేయడంతో ఆమె తల్లి, చుట్టుపక్కవారు పట్టుకుని పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు అతడిని అదుపులో తీసుకునే క్రమంలో ఇంట్లో ఉరివేసుకుని ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. వెంటనే అతన్ని కేజీహెచ్‌కు తరలించగా అప్పటి నుంచి చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందాడు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

జాతీయ స్థాయి ఖోఖో పోటీలకు ఒమ్మలి విద్యార్థిని



దివ్యను అభినందిస్తున్న హెచ్‌ఎం శోభారాణి, పీడీ సత్యం

మాడుగుల: జాతీయ స్థాయి ఖోఖో పోటీలకు మండలంలోని ఒమ్మలి జెడ్పీ ఉన్నత పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న విద్యార్థిని తెప్పల దివ్య ఎంపికైంది. ఈ నెల 17, 18, 19 తేదీల్లో విశాఖ జిల్లా భీమునిపట్నంలో జరిగిన 66వ రాష్ట్ర స్థాయి అండర్ – 14 విభాగంలో ఖోఖో పోటీలు జరిగాయి. ఈ పోటీల్లో జిల్లా జట్టు తృతీయ స్థానంలో నిలిచింది. ఇందులో ప్రతిభ కనబరిచిన దివ్య రాష్ట్ర జట్టు తరపున జాతీయ స్థాయి ఖోఖో పోటీల్లో పాల్గొనడానికి ఎంపికైంది. ఈ హైస్కూల్ నుంచి గత నెలలో కర్నూలు జిల్లా నంద్యాల, తూర్పుగోదావరి జిల్లా అనపర్తిలో జరిగిన ఖోఖో పోటీల్లో నలుగురు, త్రోబాల్‌కు ఇద్దరు ప్రతిభ చూపి రాష్ట్ర పోటీలకు ఎంపికయ్యారని హెచ్‌ఎం శోభారాణి తెలిపారు.

ఈ మేరకు మంగళవారం పాఠశాలలో పాఠశాల యాజమాన్య కమిటీ చైర్మన్ ఉగ్గిన అప్పలనాయుడు, సర్పంచ్ సుంకరి సింహాచలం నాయుడు, కోఆపరేటివ్ అధ్యక్షుడు బొడ్డపు భాస్కరరావు, తల్లిదండ్రులు దివ్యను అభినందించారు.

ఆటో బోల్తా పడి డ్రైవర్ దుర్మరణం



మృతుడు రవికుమార్

పెదగంట్యాడ: గంగవరం పోర్టు వంతెన వద్ద ఆటో అదుపు తప్పి బోల్తా పడిన ఘటనలో ఆటో డ్రైవర్ మృతి చెందాడు. న్యూపోర్టు పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని యాతపాలెంలో కోరుకొండ రవికుమార్ (33) కుటుంబంతో నివాసం ఉంటున్నాడు. ఆటో నడుపుతూ కుటుంబాన్ని పోషించుకుంటున్నారు. ఈ నెల 27న రాత్రి గంగవరం పోర్టు వంతెన వద్దకు వచ్చేసరికి స్పీడ్‌బ్రేకర్ వద్ద ఒక్కసారి బ్రేక్ వేయడంతో ఆటో అదుపు తప్పి, బోల్తా పడింది. దీంతో అతను తీవ్రంగా గాయపడ్డాడు. గమనించిన స్థానికులు 108కు సమాచారం ఇచ్చారు. అతని ఫోన్‌లోని నంబర్ ద్వారా ఆయన మేనకోడలికి సమాచారం ఇవ్వడంతో, ఆమె రవికుమార్ భార్య వరలక్ష్మికి సమాచారం తెలిపింది. పెదగంట్యాడ జంక్షన్‌కు రావాలని తెలియజేయడంతో, ఆమె హుటాహుటిన అక్కడికి చేరుకుని, 108లో క్షతగాత్రుడిని కేజీహెచ్‌కు తరలించారు. కేజీహెచ్‌లో చికిత్స పొందుతూ రవికుమార్ మంగళవారం మృతి చెందారు. మృతునికి ఇద్దరు పిల్లలు ఉన్నారు. మృతుని భార్య వరలక్ష్మి ఫిర్యాదు మేరకు న్యూపోర్టు హెడ్ కానిస్టేబుల్ నాయుడు కేసు దర్యాప్తు చేస్తున్నారు.